పీపల్‌పహడ్‌లో బీఆర్‌ఎస్ నాయకుడిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల

కార్యకర్తలకు అండగా బీఆర్‌ఎస్

- మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల

చౌటుప్పల్ రూరల్, మార్చి 26 : బీఆర్‌ఎస్ కార్యకర్తలకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మండలం దేవలమ్మనాగారం, పీపల్‌పహడ్, కొయ్యలగూడెం గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించారు. కొయ్యలగూడెం గ్రామంలో గుండెపోటుతో మృతి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు గడ్డం యాదగిరికి నివాళులర్పించారు. నాగారం గ్రామంలో అనారోగ్యానికి గురైన పార్టీ నాయకుడు జంగారెడ్డిని, పీపల్‌పహడ్ గ్రామంలో ప్రమాదానికి గురైన ఎర్ర సతీశ్‌యాదవ్‌ను, గుండెపోటుకు గురైన అంజయ్యను కూసుకుంట్ల పరామర్శించారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ పెద్దింటి బుచ్చిరెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు గిర్కాటి నిరంజన్, కొత్త పర్వతాలు, మాజీ సర్పంచ్‌లు కృష్ణ, కళ్లెం శ్రీనివాస్‌రెడ్డి, యాదగిరి, చిన్నం బాలరాజు, మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

తుర్కపలి : బీల్యాతండాలో లచ్చీరామ్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్యగౌడ్

మృతుల కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

తుర్కపల్లి, మార్చి 26 : మండలంలోని బీల్యానాయక్‌తండాకు చెందిన మాజీ ప్రజా ప్రతినిధి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు గుగులోతు లచ్చిరాంనాయక్(75) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ బుధవారం పరామర్శించారు. అదే తండాకు చెందిన సుశీలమ్మ ఇటీవల మృతి చెందగా ఆమె కుటుంబ సభ్యులను ఓదార్చి ఆర్థికసాయం అందించారు.

ఆయన వెంట బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పిన్నపురెడ్డి నరేందర్‌రెడ్డి, మాజీ జడ్పీ వైస్‌చైర్మన్ బీకునాయక్, మాజీ ఎంపీపీ బబ్బూరి రవీంద్రనాథ్‌గౌడ్, ఎంపీటీసీలు గిద్దె కరుణాకర్, పలుగుల నవీన్‌కుమార్, బీఆర్‌ఎస్ మండల సెక్రటరీ జనరల్ శ్యాగర్ల పరమేశ్, సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ నల్ల శ్రీకాంత్, మాజీ సర్పంచ్‌లు నామసాని సత్యనారాయణ, మేకల బాలకృష్ణ, నాయకులు చిన్నం నర్సింహారెడ్డి, యాదగిరి, మోతీరాం, భాస్కర్‌నాయక్ తదితరులు న్నారు.

ఉత్తమ రైతుగా కంచి మల్లయ్య

కంచి మల్లయ్యను సన్మానిస్తున్న టీడీపీ అధ్యక్షుడు రఘురాం

ప్రకృతి రత్న పురస్కారం అందుకుంటున్న రైతు గోవర్ధన్‌రెడ్డి

భువనగిరికలెక్టరేట్, మార్చి 26 : సేంద్రీయ వ్యవసాయంలో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధిస్తూ ఆదర్శంగా నిలిచిన మండలంలోని వీరవెల్లి గ్రామానికి చెందిన రైతు కంచి మల్లయ్యకు తెలంగాణ రాష్ట్ర స్థాయి ఉత్తమ రైతు అవార్డును అందించారు. ఉగాది సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు మండలంలోని ఆర్కే ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయనకు అవార్డును అందించి సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర సేంద్రియ ఉత్పత్తుల ధ్రువీకరణ ఆథారిటీ చైర్మన్ శావల దేవదత్, రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ పద్మశ్రీ అవార్డు గ్రహీత వై.వెంకటేశ్వరావు, బిల్లపాటి గోవర్ధన్‌రెడ్డి, చాంద్‌పాషా, శరత్‌కుమార్‌రెడ్డి తదితరులున్నారు.

మోత్కూరు : అదే విధంగా మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని ఆరెగూడేనికి చెందిన రైతు బిళ్లపాటి గోవర్ధన్‌రెడ్డి కూడా రాష్ట్రస్థాయి ప్రకృతి రత్న ఉగాది పురస్కారం అందుకున్నారు.

పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలి

- మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

భువనగిరి కలెక్టరేట్, మార్చి 26 : పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులను తొలగించాలని మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. భువనగిరి మండలంలోని నందనం నుంచి సిరివేణికుంట గ్రామాల మధ్య జరుగుతున్న బ్రిడ్జి నిర్మాణ పనులను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి పనులను పూర్తి చేయడంలో పూర్తిగా విఫలమయ్యిందన్నారు. బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలు, ఆందోళనలతో పెండింగ్ పనులు ఊపందుకున్నాయని తెలిపారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, మాజీ జడ్పీటీసీ బీరు మల్లయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎన్నబోయిన ఆంజనేయులు, పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు జనగాం పాండు, ఏవీ కిరణ్‌కుమా ర్, నాయకులు నీల ఓంప్రకాశ్‌గౌడ్, రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, ర్యాకల శ్రీనివాస్, వెంకటేశ్, మురళి, మట్ట ధనుంజయ్, బాతుక అశోక్, కొండల్, భాస్కర్, మూలె నాగేంద్రబాబు, సతీశ్, యాస సంతోష్, మోత్కుపల్లి అజయ్ ఉన్నారు.

ప్రశ్నిస్తే కేసులు పెడతారా?

- షీప్ అండ్ గోట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బాలరాజు యాదవ్

ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న దూదిమెట్ల బాలరాజు యాదవ్, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల కృష్ణారెడ్డి

భువనగిరి అర్బన్, మార్చి 26 : రైతులను ఆదుకోవాలని ప్రశ్నిస్తే కేసులు పెడతారా? అని షీప్ అండ్ గోట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. యాదాద్రి భువనగిరి పట్టణంలోని రహదారి బంగ్లాలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు రైతులకు చెప్పిందేంటి, ప్రస్తుతం చేస్తుందేంటని మండి పడ్డారు. పంటలకు సాగునీరు అందక ఎండిపోయి రైతులు గోస పడుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15 నెలల్లో క్రైమ్‌రేట్ విపరీతంగా పెరిగిందని, పట్టపగలే ఎంఎంటీఎస్‌లో మహిళలపై నేరాలు జరుగుతున్నాయన్నారు. అధికార పార్టీ పీఏలు, అనుచరుల హస్తంతో యథేచ్ఛగా పేపర్ లీకేజీలు జరుగుతున్నాయని విమర్శించారు. కొడంగల్‌లో గిరిజన రైతులు భూములు కోల్పోతున్నారని ప్రశ్నిస్తే కేటీఆర్, దిలీప్, క్రిశాంక్‌పై ప్రభుత్వం కేసులు పెట్టి గొంతు నొక్కాలని చూస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు కేసీఆర్, కేటీఆర్‌పై ఎన్నో అవినీతి ఆరోపణలు చేశారు కానీ.. నిరూపణలో విఫలమయ్యారని దుయ్యబట్టారు. రైతాంగాన్ని ఆదుకొని, సాగునీరు ఇవ్వాలని, కేటీఆర్, బీఆర్‌ఎస్ నాయకులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వరంగల్ సభకు యాదాద్రి జిల్లా నుంచి బీఆర్‌ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ భువనగిరి నియోజకవర్గంలో నీళ్లు అందక పంటలు ఎండిపోయాయని, రైతులకు వెంటనే పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి ఉన్నారు.

దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణకు రావాలని మాజీ ఎమ్మెల్యే పైళ్లకు ఆహ్వానం

బీబీనగర్ : దొడ్డి కొమురయ్య 98వ జయంతి సందర్భంగా ఏప్రిల్ 3వ తేదీన మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరుకావాలని కోరుతూ భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ నేత దూదిమెట్ల బాల్‌రాజ్ యాదవ్‌కు విగ్రహ కమిటీ ఆహ్వాన పత్రికను అందించారు.

యువకుడి ఆత్మహత్య

హరిబాబు (ఫైల్)

రాజాపేట, మార్చి 26 : మండలంలోని మల్లెగూడెంలో తండ్రి మందలించాడని ఇంట్లో నుంచి వెళ్లిపోయిన యువకుడు గ్రామ శివారులోని గుట్టల్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు బుధవారం గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రెడ్డబోయిన మల్లయ్య కుమారుడు హరిబాబు అలియాస్ అభి(19) తన తండ్రి మందలించాడని ఈనెల 21న ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయాడు. మూడ్రోజుల నుంచి యువకుడి ఆచూకీ కోసం బంధువులు, స్నేహితుల ఇండ్లలో వెతికినా ఆచూకీ తెలియలేదు. దీంతో కుమారుడు కనుబడడం లేదని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇదిలా ఉండగా గ్రామ శివారులోని గుట్టల్లో కొంద్రెడ్డి చెరువు వద్ద ఓ రైతు కోతులను తరిమి కొడుతుండగా యువకుడు చెట్టుకు ఉరి వేసుకొని కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. యాదగిరిగుట్ట సీఐ ఏడుకొండలు, రాచకొండ క్లూస్ టీమ్ ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహన్ని పరిశీలించి హరిబాబుదిగా గుర్తించారు. ఇంట్లో నుంచి వెళ్లిపోయిన రోజే ఆత్మహత్య చేసుకున్నట్లుగా అంచనా వేశారు. తండ్రి ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ మైసయ్య కేసు నమోదు చేసుకొని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆలేరు ప్రభుత్వ దవాఖానకు తరలించారు. యువకుడి ఆత్మహత్యగల పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఏఎస్ఐ తెలిపారు.

గర్భిణి ఇంటిని కలెక్టర్ సందర్శన

రామోజీనాయక్‌తండాలో అఖిలకు న్యూట్రిషన్ కిట్టు అందిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

తుర్కపల్లి, మార్చి 26 : మండలంలోని రామోజీనాయక్ తండాకు చెందిన గర్భిణి అఖిల ఇంటిని బుధవారం కలెక్టర్ హనుమంతరావు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా అఖిల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని, పౌష్టికాహారంపై పలు సూచనలు చేశారు. ప్రభుత్వ దవాఖానలోనే కాన్పు చేయించుకోవాలని సూచించారు. ప్రతి నెలా ఒక రోజు జిల్లా వ్యాప్తంగా అమ్మభరోసా కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం అఖిలకు కలెక్టర్ న్యూట్రిషన్ కిట్ అందించారు. ఆయన వెంట తాసీల్దార్ దేశ్యా, వైద్య సిబ్బంది ఉన్నారు.

వర్షం నీటిని వృథా చేయొద్దు : అదనపు కలెక్టర్ వీరారెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

చౌటుప్పల్, మార్చి 26 : వర్షం నీటిని వృథా చేయకుండా, ప్రతీ బొట్టును ఒడిసిపట్టి పొదుపుగా వాడుకోవాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని రైతు వేదికలో భూగర్భజలాల లభ్యత, వినియోగంపై ఆ శాఖ ఆధ్వర్యంలో ఎస్ఏఆర్‌పీ సంస్థ సహకారంతో బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి ఇంటి ముందు నాలుగు మొక్కలను నాటి సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా, మండల అధికారులు పద్మజారాణి, సుభాషిణి, గోపాల్‌రెడ్డి, నర్సింహారెడ్డి, రాజరామ్, సాయికృష్ణ, విజయ్‌కుమార్‌రెడ్డి, పి.జ్యోతి కుమార్, హరికృష్ణ పాల్గొన్నారు. పట్టణంలోని శివాజీ నగర్‌లో అదనపు కలెక్టర్ వీరారెడ్డి పర్యటించి అమ్మకు భరోసా కార్యక్రమంలో భాగంగా గర్భిణీ మమతకు న్యూట్రిషన్ కిట్‌ను అందించారు.

హామీలు నెరవేర్చాలి : మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ అల్గుబెల్లి నర్సిరెడ్డి

రామన్నపేట, మార్చి 26 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు పోరాటం ఆగదని మాజీ ఎమ్మెల్సీ అల్గుబెల్లి నర్సిరెడ్డి, సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ జహంగీర్ అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న పాదయాత్రలో బుధవారం వారు పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారెంటీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. కేంద్రం ప్రభుత్వం డిలిమిటేషన్‌లో దక్షిణాది రాష్ట్రాలకు ప్రాతినిధ్యం తగ్గించి ఇతర రాష్ట్రాలను మోసం చేస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి, పాదయాత్ర బృందం నాయకులు జెల్లెల పెంటయ్య, బొడ్డుపల్లి వెంకటేశం, బోయిని ఆనంద్, కందుల హన్మంతు, వేముల సైదులు, కొమ్ము అంజమ్మ, మేడి గణేశ్, గొరిగే సోములు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్లను త్వరగా పూర్తి చేయాలి : జడ్పీ సీఈఓ

శివారెడ్డిగూడెంలో మాట్లాడుతున్న జడ్పీసీఈఓ శోభారాణి

భూదాన్‌పోచంపల్లి, మార్చి 26 : ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేయాలని జడ్పీ సీఈఓ శోభారాణి అన్నారు. మండలంలో ని వంకమామిడి గ్రా మంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను బుధవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. నిర్మాణం లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. డీఏఆర్‌పీజీ అవార్డుకు యాదాద్రి భువనగిరి జిల్లా నుంచి రాష్ట్రస్థాయికి ఎంపికైన శివారెడ్డిగూడెం జీపీని జడ్పీ సీఈఓ, డీఆర్డీఓ నాగిరెడ్డి, డీపీఓ సునంద, ఎంపీడీఓ భాస్కర్‌గౌడ్ సందర్శించి పంచాయతీ కార్యదర్శికి సూచనలు చేశారు. పరిశుభ్రత కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. అనంతరం రేవనపల్లిలో గర్భిణులకు పండ్లు పంపిణీ చేశారు. వారి వెంట ఏపీఓ కృష్ణమూర్తి, ఐకేపీ నీరజ ఉన్నారు.

చేనేత రుణమాఫీకి ప్రణాళికలు సిద్ధం : పాండు

భూదాన్‌పోచంపల్లి, మార్చి 26 : చేనేత రుణమాఫీకి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తుందని పద్మశాలి చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు అంకం పాండు అన్నారు. భూదాన్‌పోచంపల్లిలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆయన వెంట జిల్లా నాయకుడు తడక వెంకటేశం, టై అండ్ డై అసోసియేషన్ అధ్యక్షుడు భారత లవకుమార్, చేనేత కార్మిక సంఘం ప్రతినిధులు భారత భూషణం, బొమ్మ హరిశంకర్, బిట్ల గణేశ్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

మోత్కూరు, మార్చి 26 : మండలంలోని దత్తప్పగూడేనికి చెందిన యువకుడు చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన సీలం ప్రజ్వల్(20) సెంట్రింగ్ మేస్త్రీగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం తండ్రి స్లీవరాజుతో గొడవ పడి సెల్‌ఫోన్ రిపేరుకు వినియోగించే లిక్విడ్‌ను తాగి అపస్మారక స్థితికి చేరుకోవడంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఉస్మానియా దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృత దేహానికి పంచనామా చేసినట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

యూడీఐడీ కార్డులను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలి : డీఆర్డీఓ

సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్డీఓ నాగిరెడ్డి

భువనగిరికలెక్టరేట్, మార్చి 26 : దివ్యాంగులు యూడీఐడీ కార్డులను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీఓ నాగిరెడ్డి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి నరసింహారావు అన్నారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం జిల్లా మహిళా, శిశు వికలాంగుల, వయో వృద్ధుల సంక్షేమ, గ్రామీణాభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో దివ్యాంగులకు యూడీఐడీ కార్డులపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ కార్డులో కేంద్ర, రాష్ట్ర ఫలాలు పొందవచ్చని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయ సూపరిండెట్ శశికళ, యశోద, ఏపీఓ శ్రీనివాస్, రాజేశ్వరి, జిల్లా సంక్షేమ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మభిక్షానికి నివాళి

రాజాపేట : బేగంపేటలో ధర్మభిక్షం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు

సంస్థాన్ నారాయణపురంలో ధర్మభిక్షం విగ్రహానికి నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు

రాజాపేట, మార్చి 26 : మండలంలోని బేగంపేటలో మాజీ ఎంపీ ధర్మభిక్షం వర్ధంతిని బుధవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి చిగుళ్ల లింగం, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : మండల గీతపారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు పంజాల నర్సయ్యగౌడ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ధర్మభిక్షం విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో గౌడసంఘం నాయకులు సత్యనారాయణ, దశరథగౌడ్, ఐలయ్య, సత్తయ్య, స్వామి, మల్లేశ్, శేఖర్, జహంగీర్, విష్ణు పాల్గొన్నారు.

ఆలేరు టౌన్ : సీపీఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేశ్ ఆధ్వర్యంలో పట్టణంలోని స్థానిక గౌడ సంఘం ప్రాంగణంలో ధర్మభిక్షం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి గొట్టిపాముల శ్రీనివాస్, బొడ్డు అంజనేయులు, మండల నాయకులు పల్లె శ్రీను, దూడల లింగం పాల్గొన్నారు.

భూదాన్ పోచంపల్లి : పట్టణ కేంద్రంలోని కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘ భవనంలో గౌడ సంఘ నాయకులు ధర్మభిక్షం గౌడ్ చిత్రపటానికి నివాళులర్పించారు. సంఘ అధ్యక్షుడు గునిగంటి మల్లేశ్‌గౌడ్ , నాయకులు మక్తల పోచయ్య , తండ వెంకటేశం, కండె యాదయ్య, సార బాలయ్య పాల్గొన్నారు.

చౌటుప్పల్ : పట్టణంలో స్థానిక గౌడ సంఘం ఆధ్వర్యంలో ధర్మభిక్షం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చింతకింది అంజయ్య గౌడ్, బత్తుల లక్ష్మయ్య గౌడ్, తొర్పునూరి వెంకటేశం గౌడ్, శ్రీశైలం గౌడ్, మల్లేశం గౌడ్ పాల్గొన్నారు.

సంస్థాన్ నారాయణపురం : మండల కేంద్రంలో బుధవారం ధర్మభిక్షం చిత్రపటానికి పందుల యాదగిరి, బద్దం యాదయ్య, మొగుదాల సత్తయ్య, వీరమళ్ల యాదయ్య, పాలకూర్ల సతీశ్ తదితరులు నివాళులర్పించారు.

రామన్నపేట : మండలంలో నాయకులు ఎర్ర రమేశ్, పరిటాల రవి, గంగాపురం వెంకటయ్య, బాలగోని మల్లయ్య, ఎర్ర వెంకటేశ్ ధర్మభిక్షం చిత్రపటానికి నివాళులర్పించారు.

మోత్కూరు : సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో ధర్మభిక్షం చిత్రపటానికి నివాళులర్పించారు. నాయకులు చాపల అంజయ్య, లక్ష్మీనర్సయ్య, అన్నెపు వెంకట్, బీసు సత్తయ్య, బత్తిని శ్రీనివాస్, ఎడ్ల నరేశ్, వెంకన్న, యాదగిరి పాల్గొన్నారు.

లారీని ఢీకొట్టిన ట్రావెల్స్ బస్సు

- 13 మందికి తీవ్ర గాయాలు

చౌటుప్పల్ మండలం ధర్మోజిగూడెం గ్రామం వద్ద జాతీయ రహదారిపై లారీని వెనుక నుంచి ఢీకొట్టిన ట్రావెల్స్ బస్సులు

చౌటుప్పల్‌రూరల్, మార్చి 26 : మండలంలోని ధర్మోజిగూడెం గ్రామ పరిధిలో బుధవారం ఎన్‌హెచ్ 65పై జరిగిన రోడ్డు ప్రమాదంలో 13మందికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్‌హెచ్ 65పై ధర్మోజిగూడెం గ్రామం వద్ద బుధవారం తెల్లవారుజామున ఐదున్నర గంటల ప్రాంతంలో విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్తున్న భారీ ట్రక్కు డ్రైవర్ బ్రేక్ వేయడంతో వెనుక నుంచి రాజమండ్రి – హైదరాబాద్ వెళ్తున్న ఆరెంజ్ ట్రావెల్స్ బస్సు వేగంగా వచ్చి ఢీ కొట్టింది. దీంతో వెనుకనున్న సాయికృష్ణ ట్రావెల్స్ బస్సు.. ఆరెంజ్ ట్రావెల్స్‌ను ఢీ కొట్టడంతో ప్రయాణికులకు గాయాలయ్యాయి. ఈ ఘటనలో రెండు బస్సుల్లోని డ్రైవర్లు శివనారాయణ, నర్సింహారావు బస్సు క్యాబిన్‌లో చిక్కుకున్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వాళ్లను బయటకు తీసేందుకు తీవ్రంగా శ్రమించారు. 13 మంది ప్రయాణికులు తీవ్రంగా గాయడడంతో క్షతగాత్రులను బయటకు తీసి చౌటుప్పల్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. గాయపడిన వారిలో ముప్పరాజు మణికంఠ(రాజమండ్రి), సుజిత్‌కుమార్(ఒడిశా),శ్రీపాద విజయ్(తూర్పుగోదావరి), పోలుకొండ అనూష(తాడేపల్లిగూడెం), మాడి విశ్వనాథ్(ఒడిశా), బిపిన్ నాయుడు(హైదరాబాద్), బిదన్ సుతార్(ఒడిశా), రాయపురెడ్డి వీరవాణి(నిజాంపేట్), వెళ్లేటి మానిక(ప.గో)సుధా జగన్నాథ్(ఒడిశా), కాట్రగడ్డ సాయి చైతన్య(తూ.గో), గడ్డం కిశోర్(తాడెపల్లిగూడెం), కేత శివ నారాయణ (తూ.గో) ఉన్నారు. 108 అంబులెన్స్‌కు సమాచారం అందించినా ఆలస్యంగా వచ్చిందని, అది కూడా కేవలం ఒకటి మాత్రమే రావడంతో సహాయక చర్యలకు ఇబ్బందులయ్యాయని స్థానికులు తెలిపారు. దీంతో జాతీయ రహదారిపై భారీ స్థాయిలో ట్రాఫిక్ జామ్ కావడంతో సీఐ మన్మథకుమార్, ట్రాఫిక్ సీఐ విజయ్‌కుమార్‌తో కలిసి ఎస్‌లు, కానిస్టేబుళ్లు ట్రాఫిక్ క్లియర్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు. నిర్లక్ష్యంగా లారీని నడుపుతూ అకస్మాత్తుగా ట్రక్కును ఆపడం వల్లే ప్రమాదం సంభవించిందని లారీ డ్రైవర్‌పై ఆరెంజ్ ట్రావెల్స్ మెనేజర్ సుర్కంటి పాండు రంగారెడ్డి చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అక్రమ కేసుకు నిరసనగా రాస్తారోకో

యాదగిరిగుట్ట, మార్చి26 : బీజేపీ పట్టణాధ్యక్షుడిపై పెట్టిన అక్రమ కేసుకు నిరసనగా ఆ పార్టీ నాయకత్వం బుధవారం పట్టణంలో రాస్తారోకో చేశారు. మండల పరిషత్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి బస్టాండ్ వద్ద ప్రధాన రహదారిపై బైఠాయించారు.

యువకుడు అదృశ్యం.. కేసు నమోదు

చౌటుప్పల్ రూరల్, మార్చి 26 : చౌటుప్పల్ రిజిస్ట్రార్ దోనూరి కృష్ణారెడ్డి తన కుమారుడు జశ్వంత్‌రెడ్డి కన్పించడం లేదంటూ బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాలు.. కృష్ణారెడ్డి, తన భార్యతో కొన్నేండ్లుగా విడిగా ఉంటున్నాడు. ఈ క్రమంలో కుమారుడు జశ్వంత్ బుధవారం తల్లి వద్దకు వెళ్తానని చెప్పడంతో రూ.వెయ్యి ఇచ్చి కృష్ణారెడ్డి డ్యూటీకి వెళ్లాడు. సాయంత్రం అయినా జశ్వంత్ తల్లి వద్దకు చేరకపోవడంతో ఇంటికెళ్లి చూడగా జశ్వంత్ సెల్‌ఫోన్ ఇంట్లోనే వదిలేసి ఎటో వెళ్లిపోయాడు. చుట్టుపక్కల, బంధువుల ఇంట్లో వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో కృష్ణారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇఫ్తార్ విందు

వలిగొండ : సంగెం గ్రామంలో..

మోత్కూరు జామె మసీదులో..

వలిగొండ, మార్చి 26 : మండలంలోని సంగెం గ్రామంలోని మసీద్‌లో ముస్లింలకు రంజాన్ మాసం సందర్భంగా పారిశ్రామిక వేత్త సుర్కంటి మురళీధర్‌రెడ్డి బుధవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు కీసరి రాంరెడ్డి, కాసుల కృష్ణ, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు జక్కుల వెంకటేశం, గంగాపురం లింగస్వామి, కీసరి కిరణ్‌రెడ్డి, మల్లారెడ్డి, పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, ఎల్కపల్లి నరసింహ, పన్నాల వాసుదేవ రెడ్డి, తాడూరి లింగస్వామి, ఉండాటి వెంకటేశం, కొమిరె నాగార్జున, మదార్, ఖాదర్, ఇమామ్, సైదులు, బుర్హాన్ పాల్గొన్నారు.

ముస్లిం విద్యార్థులకు పండ్లు పంపిణీ

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రంలోని బ్రిలియంట్ పాఠశాలలో చదువుతున్న ముస్లిం విద్యార్థులకు రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని బుధవారం పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పావనికోటేశ్వరి పాల్గొన్నారు.

మోత్కూరు : మున్సిపాలిటీ కేంద్రంలోని ముస్లింలకు బుధవారం స్థానిక జామ మసీద్‌లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి తాసీల్దార్ రాంప్రసాద్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ లక్ష్మీనర్సింహారెడ్డి, మోత్కూరు, అడ్డగూడూరు మండలాలకు చెందిన పీఏసీఎస్ చైర్మన్లు వెంకటేశ్వర్లు, నిరంజన్‌రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బొల్లేపల్లి వెంకటయ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ లింగాల నర్సిరెడ్డి, రెడ్ క్రాస్ ప్రతినిధులు కొమ్మిడి ప్రభాకర్‌రెడ్డి, వేణు, యాదయ్య, మహ్మద్ అలీ, మజీద్, ఖాజ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నాను జయప్రదం చేయాలి : సీపీఎం

భువనగిరి అర్బన్ : మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు అనురాధ

భువనగిరి అర్బన్, మార్చి 26 : మున్సిపాలిటీలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈనెల 29న మున్సిపల్ ఆఫీస్ ఎదుట నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు బట్టుపల్లి అనురాధ అన్నారు. స్థానిక సుందరయ్య భవన్‌లో బుధవారం జరిగిన పట్టణ కమిటీ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు మాయ కృష్ణ, కల్లూరి నాగమణి, వల్దాస్ అంజయ్య పాల్గొన్నారు.

బొమ్మలరామారం : మండలంలో పేరుకుపోయిన సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 29న మండల కేంద్రంలోని తాసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించే ప్రజాధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ర్యాకల శ్రీశైలం అన్నారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన సీపీఎం ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు ముక్కర్ల పున్నమ్మ, దేశెట్టి సత్యనారాయణ, లక్ష్మయ్య, నరేశ్, లక్ష్మి, అరుణ పాల్గొన్నారు.

చౌటుప్పల్ : ఈనెల 28న చౌటుప్పల్ మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట జరిగే సీపీఎం మహాధర్నాను విజయవంతం చేయాలని మాజీ వార్డు కౌన్సిలర్ గోపగోని లక్ష్మణ్ గౌడ్ పిలుపునిచ్చారు. పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఆ పార్టీ మున్సిపల్ కార్యదర్శి గోశిక కరుణాకర్, నాయకులు దండ అరుణ్‌కుమార్, అవ్వారి రామేశ్వరి, బత్తుల దాసు, ఉష్కాగుల శ్రీను, బాతరాజు దశరథ పాల్గొన్నారు.